# సింగిల్ పేజీ కథలు

## శభాష్ సంధ్యా!

"సంధ్యా! ఐ లవ్ యూ!"

ఎలెక్స్ హేలీ రాసిన రూట్స్ నవలని సీరియస్‌గా చదువుతున్న సంధ్య తల ఎత్తి చూసింది.

ఎదురుగా నిరంజన్.

కాలేజీలో ఆడపిల్లల్ని ఏడిపిస్తూ లైఫ్‌ని ఎంజాయ్ చేస్తూ తిరిగే రౌడీ గ్యాంగుకి లీడరు. తండ్రి రాజకీయ పలుకుబడి డబ్బు మదంతో ఎవరికీ భయపడకుండా తిరుగుతూంటాడు. అతడి వెంట ఎప్పుడూ అమ్మాయిలు అబ్బాయిలు బెల్లం చుట్టూ ఈగల్లా తిరుగుతారు.

ఫ్రెండ్స్‌కి పార్టీలు ఇవ్వటం గర్ల్‌ఫ్రెండ్స్‌తో షికార్లు కొట్టడం లెక్చరర్స్‌ని ఏడిపించటం క్లాసులు ఎగ్గొట్టడం హీరోయిజం అనుకుంటాడు.

ఆలోచనలకి ఫుల్‌స్టాప్ పెట్టి నిరంజన్ వైపు చూసింది.

తన పక్కనే గడ్డిలో కాళ్లు రెండూ చాపి చేతుల సాయంతో వెనక్కి కొద్దిగా వంగి సిగరెట్ పొగని రింగుల రింగులుగా వదులుతున్నాడు.


మనసులో చెలరేగే భావాలను చిరునవ్వు వెనుక దాచేస్తూ...

"నిరంజన్! నువ్వు సూటిగా చెప్పావు కాబట్టి నేను కూడా సూటిగా నిన్నొక ప్రశ్న అడుగుతున్నాను. నేనొక సామాన్య కుటుంబానికి చెందిన అమ్మాయిని. నువ్వేమో అందం...ఆస్తి... హోదా కలిగిన అబ్బాయివి. నేను నీతో ఏ విషయంలోనూ సరితూగే స్థాయిలో లేను. అలాంటిది నువ్వు నన్ను ఇష్టపడడం ఎంతో ఆశ్చర్యంగా ఉంది" అడిగింది సంధ్య.

కాలేజీలో మోస్ట్ బ్రిలియంట్ స్టూడెంట్ అని లెక్చరర్స్ అంతా మెచ్చుకునే సంధ్య తనని 'అందగాడు' అనేసరికి నిరంజన్‌కి చాలా సంతోషం అనిపించింది. చేతిలోని సిగరెట్‌ని దూరంగా విసిరేసి సంధ్యవైపు తిరిగి..

"సంధ్యా! నేను పిలిచిన వెంటనే నాతో షికార్లకి, సినిమాలకి వచ్చే అమ్మాయిలంటే చాలా 'బోర్'గా ఉంది. వారంతా జాలీగా తిరగడానికే బాగుంటారు. పెళ్లిచేసుకోవడానికి మాత్రం నీలాంటి సంసారపక్షంగా ఉండే అమ్మాయే బాగుంటుందనిపించింది. 'టచ్ మి నాట్'లా ఉండే నువ్వంటే ఇష్టపడుతున్నాను. పెళ్లి చేసుకోవాలని అనుకుంటున్నాను. నువ్వు కూడా సరే అనేస్తే డాడీతో చెప్పి ముహూర్తాలు పెట్టించేస్తాను"

"చూడు నిరంజన్! నిన్ను పెళ్లి చేసుకోవడానికి నాకు ఎలాంటి అభ్యంతరము లేదు. అయితే నాకు పెళ్లి కన్నా ముఖ్యమైన జీవితాశయం ఉంది. అది పూర్తయిన తర్వాతే పెళ్లి. ముందు చదువు పూర్తి చేయాలి. మంచి ఉద్యోగం సంపాదించుకుని వృద్ధుల కోసం ఒక అందమైన 'ఓల్డేజ్ హోమ్' కట్టించాలి. అలాగే అనాథపిల్లల కోసం ఒక ఆశ్రమం కట్టించాలి. ఆ పెద్దలకి ఈ పిల్లలకి మధ్య ఆత్మీయతానుబంధాల సేతువు నిర్మించాలి. వారందరి కళ్లల్లో ఆనందాన్ని చూస్తూ సంతృప్తిగా వారి మధ్య జీవితం గడిపేయాలి. ఇది నా ఎనిమిదేళ్ల కల. నువ్వు నన్ను ప్రేమిస్తున్నావు కాబట్టి నా ఆశయంలో కూడా పాల్పంచుకుంటావని అనుకుంటున్నాను. మన



పెళ్లయిన తరువాత మనిద్దరం హాయిగా... ప్రశాంతంగా ఆ ఆశ్రమంలో మన కొత్తకాపురం మొదలుపెడదాం. నా ప్రేమ కోసం నీ ఆస్తిని...హోదాని వదులుకుని సంతోషంగా వచ్చేస్తావని నాకు తెలుసు. నాలుగు రోజులు బాగా ఆలోచించి నీ నిర్ణయం చెప్పు. నేను ఎదురుచూస్తూంటాను."

చేతిలోని బేగ్‌ని భుజానికి తగిలించుకుని డ్రెస్‌కి అంటిన మట్టిని దులుపుకుంటూ "వస్తాను నిరంజన్! చీకటవుతోంది" గబగబా నడిచింది.

* * *

ఏడు తరాల ఆఫ్రికా వాసుల కథ పూర్తిగా చదివేసరికి సంధ్య మనస్సు అంతా భారంగా అయిపోయింది. 'ఒక మంచి పుస్తకం చదివాను' పుస్తకం మూసేస్తూ అనుకుంది సంధ్య.

"సంధ్యా! నువ్విక్కడ ఉన్నావా? నువ్విలాగే పుస్తకాలు చదువుతూ కూర్చో. నీ చుట్టూ ఉన్న ప్రపంచం మునిగిపోయినా నీకు తెలీదు. మహాతల్లీ! ఒకసారి కళ్లు తెరచి చుట్టూ చూస్తే జరుగుతున్న ఘోరాలు కనిపిస్తాయి" విసురుగా అంది భారతి.

"నా ప్రియనేస్తానికి నా మీద ఎందుకంత కోపం. ఏం జరిగిందబ్బా. చెప్పవా బుజ్జితల్లీ!" గెడ్డం పట్టుకుని సంధ్య ముద్దు ముద్దుగా అడిగేసరికి కోపం మరచిపోయి, ఫక్కున నవ్వేసింది భారతి.

"సంధ్యా! నాలుగు రోజుల క్రితం నీతో 'ఐ లవ్ యూ' చెప్పిన నిరంజన్ నిన్న మన ప్రీతితో నువ్వంటే ఇష్టమని చెప్పాడంట."

"అయితే ఏంటంట రోగి కోరిందీ...వైద్యుడు ఇచ్చిందీ ఒకటే అయినపుడు సంతోషించక బాధపడటం దేనికీ?"

సంధ్య మాటలకి బిత్తరపోయి "అంటే నీకు...నీకు...బాధగా లేదా" అడిగింది భారతి.

"భారతీ! నిరంజన్ ఒక మూర్ఖుడు. ఎంతకైనా తెగించే రకం. అలాంటి వాడు 'ఐ లవ్ యూ' చెప్పగానే నువ్వంటే నాకిష్టం లేదు. నిన్ను చూస్తే నాకు అసహ్యం.. ఈ జన్మలో నీతో పెళ్లి జరగదు' లాంటి సినిమా డైలాగులు చెప్పాననుకో వాడు ఆ అవమానాన్ని భరించలేక ఎలాంటి ఘాతుకానికైనా పాల్పడతాడు. అలాంటి కేసులు ఎన్ని చదవడం లేదు. ఎన్ని చూడడం లేదు. అన్ని సమస్యలకీ అన్ని సమయాల్లో ఆవేశం చూపించడం మంచిది కాదు. ముఖ్యంగా మనలాంటి ఆడపిల్లలు ఇలాంటి పరిస్థితిని ఆవేశంతో కాకుండా వివేకంతో పరిష్కరించుకోవాలి. ప్రస్తుతం నేను చేసిందదే. నిరంజన్ చేసిన ప్రపోజల్‌కి నేను 'నో' అని నా నోటితో కాకుండా అతనితోనే చెప్పించుకున్నాను. ఇక జన్మలో మళ్లీ ప్రేమ పెళ్లి అని నా జోలికి రాడు. ఇప్పటికైనా అర్థం అయిందా నా ప్లాన్" అంటూ నవ్వేసింది సంధ్య.

"నిజమైన బలం అనేది కేవలం శారీరక శక్తి మాత్రమే కాదు ఆత్మజ్ఞానం సమస్యల్ని ఎదుర్కొనే నేర్పు సమయానుకూలంగా నిర్ణయాలు తీసుకోవడం... పరిస్థితుల్ని తమకనుకూలంగా మార్చుకోవడంలో కనపడుతుంది. ఆడది అంటే అణకువతోనే ఆవేశంతోనే ఉండడం కాదు. మెలకువతో ఉండాలి అని చాలా చక్కగా నిరూపించావు. హేట్సాఫ్ సంధ్యా!" ఆప్యాయంగా సంధ్యతో అంది భారతి.

-డి.స్వర్ణశైలజ (ఖరగ్‌పూర్)